
### ఈవారం కథ

# సాగరతీర సమీపాన...

ఆఫీసు నుంచి బయట పడేసరికి, రాత్రి రెండ యింది. స్కూటర్ మీద కొద్ది దూరం వచ్చానో లేదో భద్రం కన్పించాడు.



**నాలాగే ఇంటికి పోతున్నాడ తను. ఆగి పలకరించాను.**

దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు భద్రం. క్రైం రిపోర్టర్. బాగా సీనియర్.

"ఏంటి గురూ ఇదంతా" అన్నాను. నా మాటలు అతనికి అర్థమయ్యాయి.

"గమ్మత్తుగా వుంది కదూ" అన్నాడతను.

"బేనర్ ఇదేనా" అడిగాను.

"ఇదే! 'నగరంలో గణపతుల అదృశ్యం' అని ఇంతింత లెటర్స్‌లో పెట్టాం" అన్నాడు.

"ఎవర్రాశారు"

'నేనే! నాకే ఎసైన్ చేశారు"

"మా పేపర్లో నేన్రాశాను. ఇంకేంటి సంగతులు" అడిగాను.

"బాగా అలసిపోయాను. నిద్రొస్తోంది. రేపు మాట్లాడుకుందాం" అన్నాడు. భద్రం వెళ్ళిపోయాడు.

రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. కుక్కలు మాత్రం అక్కడక్కడా గుమిగూడి వున్నాయి.

స్పీడందుకున్నాను.

రేపుగాక, ఎల్లుండి వినాయకచవితి. అంతా నవరాత్రి ఉత్సవాలు జరపడానికి ఎంతో ఉత్సాహంగా వున్నారు. ఈ సమయంలో ఈ చిత్రం! ఎవరికీ అంతు చిక్కకుండా వుంది.

గత రెండు రోజులుగా ఈ విషయమ్మై అరకొరా వార్తలు విన్పిస్తే నవ్వుకున్నాం. నిజమనుకోలేదు.

గణపతులేమిటి? మాయమవడం ఏమిటి?

చవితి నెల రోజులుండనగా దూల్‌పేటలో వినాయక విగ్రహాలు తయారవుతాయి. వాటిని వంశ పారంపర్యంగా కొన్ని కుటుంబాల వారు చేసుకొస్తున్నారు. కాంట్రాక్టు తీసుకుని, కావలసిన తీరులో బొమ్మలని చేస్తారు వాళ్ళు. అది వాళ్ళ జీవనోపాధి.

ఏటా నగరంలో ఎలా లేదన్నా రెండు వేల పై చిలుకు చిన్నా పెద్దా వినాయకులు నిమజ్జనోత్సవంలో పాల్గొంటారు. ఆ రాబడి చాలు వాళ్ళకి. సంవత్సరమంతా సరిపోతుంది.

ఎప్పట్లానే ఈసారీ బొమ్మల తయారీ ప్రారంభించారు. విగ్రహాలు పూర్తయ్యేసరికల్లా అదృశ్యమవడం మొదలయింది. రంగులేసి, అలంకరణ పూర్తి చేసేసరికి, కూర్చున్న బొజ్జ గణపయ్య లేచి నిల్చుని చరచరా వెళ్ళిపోసాగాడు. నిల్చున్న గణపతి సంగతి సరేసరి! చేతులు చొక్కా ఊవుకుంటూ 'టాటా' చెప్పేశాట్ట! పట్టుకుందామంటే దొరకడం లేదు. వెంట పడదామంటే వీలు పడడం లేదు. నోరెళ్ళబెడుతున్నారంతా. కాళ్లు, చేతులూ ఆడ్డం లేదెవరికీ.

ఈ రోజేం జరిగిందో తెలుసా? నగర శివారు ప్రాంతాల వాళ్ళు వినాయకుల్ని తోపుడు బళ్ళ మీద పెట్టుకుని వెళ్తూంటే, ఆబిడ్స్ సెంటర్‌లోను, లకడీకాపూల్ సెంటర్‌లోనూ నానా గందరగోళం ఆయింది. బళ్ళ మీంచి గెంతి గణపతులు పారిపోయార్ట! జనంలో కల్సిపోయి కన్పించలేదట! ట్రాఫిక్ జామ్ అయింది. రెండు గంటల పాటు ఎక్కడి వాహనాలక్కడే ఆగిపోయాయి. తీన్తానయింది.

ఇళ్ళల్లో పెట్టుకుని, పూజ చేసుకునే వినాయకులూ అంతేట్ట! గుడగుడలాడుతూ మూకుమ్మడిగా పారిపోతున్నార్ట! ఇంత వినాయకుడు దగ్గర్నుంచి, అంత వినాయకుడు వరకూ ఎవరూ ఎక్కడా వుండడం లేదు. పరుగులు తీస్తున్నారు.

నగరమంతా గగ్గోలుగా వుంది. ఎక్కడికి పోతున్నారు వీళ్ళంతా? ఏమయిపోతున్నారు? భాగ్యనగరాన్నొదిలి ఏ అభాగినిని చేరుకుంటున్నారు? అంతా మిస్టరీగా వుంది.

హిమాయత్ నగర్‌లో రూం. దారి తరగట్లేదు. ఖైరతాబాద్ వచ్చింది. ఫ్లై ఓవర్ ఎక్కి దిగాను. నెక్లెస్ రోడ్డు పాయింట్ దాటి, ముందుకొచ్చానో లేదో, ఒకో భారీ కాయం స్కూటర్‌కి అడ్డం పడింది. బ్రేకేసి చూద్దునో! వినాయకుడు!! సుమారు ముప్పై అడుగుల ఎత్తులో వున్నాడు. ధగధగలీనుతున్నాడు. అంతకో చెవి, ఇంతకో కొమ్ము, బాన బొజ్జ, జరీ కండువా, పంచె మీదున్నాడు. చేతులు రెండూ నడుముకాన్చుకుని నిల్చున్నాడు. కలా! నిజమా! అనిపించింది. నిజమే! స్కూటర్ స్టాండ్ **చేసి**, రెండు చేతులూ జోడిస్తే, తొండంతో నా తల నిమిరాడు. దీవించాడు. ప్రమాదం ప్రస్తుతం లేదనిపించింది.

"ఏమిటి స్వామి ఈ వింత" అన్నాను.

"వింతేముంది! నేను నేనే" అన్నాడు స్వామి.

"మిమ్మల్ని మీరు కాదనడం లేదు. కాకపోతే ఈ రాత్రివేళ ఇలా ఒంటరిగా, ఈ బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ దగ్గర మీరిలా ప్రత్యక్షం కావడం వింతగా వుంది" అన్నాను.



—జగన్నాథ శర్మ

"ఒంటరిగా ఏమీ లేను. మందీ మార్బలంతో ఉన్నాను. కావాలంటే అటు చూడు" అన్నాడు. చూశాను. హుస్సేన్ సాగరొడ్డున గుంపు గుంపులుగా కూర్చుని వున్నారు వినాయకులు. సైజుల వారీగా చక్కగా కొలువు దీరి వున్నారు. తొండాల్ని నీట ముంచుతూ, తీస్తో, ఫౌంటెన్‌లా నీటిని వదిపెడుతూ ఆడుకుంటున్నారంతా.

"ఎక్కణ్నొంచొచ్చారు వీళ్ళంతా" ప్రశ్నించాను.

"ఎక్కణ్ణుంచో రావడమేమిటి? వీళ్ళంతా ఇక్కడి వాళ్ళే" అన్నాడు స్వామి.

"అసలు నువ్వెక్కణ్ణుంచి వస్తున్నావు" అడిగాడు. చెప్పాను. నా వృత్తి, ఎక్కడ పని చేస్తున్నదీ, జీతం గీతం వగైరా వగైరాలన్నీ వివరించాను.

"జర్నలిస్టువన్నమాట! చెప్పవేం" అన్నాడు స్వామి. కళ్ళు చిట్లించి, స్కూటర్ ముందు భాగాన్న చూశాడు. 'ప్రెస్' అన్న అక్షరాలు పరికించాడు. ఇంకా అనుమాన పడుతున్నట్టనిపిస్తే, ఐడెంటిటీ కార్డు తీసి చూపించాను.

"నీ పేరు, నా పేరూ ఒకటే" అని నవ్వాడు స్వామి. చేరదీశాడు. నా భుజమ్మీద చేయి వేశాడు.

"నీతో చాలా మాట్లాడాలి. చెప్పకుంటే కొంత బాధన్నా తీరుతుంది" అన్నాడు.

"ఛ! మీకు బాధలేంటి" అన్నాను. గుర్రుగా చూశాడు నావైపు.

"మీ మనుషులకే వుంటాయా బాధలు" అడిగాడు. ఆయనకి కోపం వచ్చింది.

"పీత కష్టాలు పీతవనుకోండి" అన్నాను. సర్దిచెప్ప జూశాను. ఎంతయినా దేవుడు! మాట్లాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలనుకున్నాను.

వృత్తిరీత్యా వెధవ బుద్ధి ఉపయోగించి, అదృశ్యాల అసలు విషయం కూపీ లాగుదామనిపించింది.

ఇద్దరం రోడ్డు డివైడర్ మీద కూర్చున్నాం. చుట్టూ ఎలకలు అలంగం తిరుగుతున్నాయి. కసిరి వాటిని పొమ్మన్నాడు స్వామి. దూరంగా వెళ్ళిపోయాయవి.

"చెప్పండి" అన్నాను.

"ఏం చెప్పమంటావు" నిట్టూర్చాడు.

"మీ బాధలు" అన్నాను.

"ఒకటా రెండా! సీరియలైజ్ చేయొచ్చు మీ పేపర్లో" అన్నాడు స్వామి.

"పోలీసుల్ని తీసుకుందాం. మా ఎత్తుల మీద ఆంక్షలు విధిస్తున్నారు వాళ్ళు. భక్తికో గొప్పకో వేడుగ్గా మమ్మల్ని తయారు చేస్తుంటే వీలు కాదంటున్నారు. మూడడుగులు కన్నా ఎత్తు ఉండకూడదంటున్నారు. నెత్తి మీద మేకులు దిగేస్తున్నారు. రోజురోజుకీ కుంచించుకు పోవాల్సి వస్తోంది" అన్నాడు.

"మాటలే స్వామి! చేతల్లో ఎక్కడ చూపిస్తున్నారు వాళ్ళు, అయినా భక్తులు వింటున్నారా? ఏ రాజకీయ నాయకుణ్నో పట్టుకుని, కావాల్సినంత ఎత్తుగా మిమ్మల్ని చేసుకోవడం లేదూ! మీరు కూడా అలా మాట్లాడితే ఎలా" అన్నాను. ఖైరతాబాద్ వినాయకుడని, స్వామిని ముందుగానే కనిపెట్టాను.

"చందాలు తీసుకో! బలవంతాన చందాలు వసూలు చేస్తే శిక్షిస్తామంటారు. నిజంగా శిక్షిస్తున్నారా? లేదే! పైగా ఈ చందాలిచ్చే వాళ్ళంతా చచ్చి, స్వర్గం దగ్గర 'క్యూ' కడుతున్నారు. గణపతి నవరాత్రులకు మేం అంతిచ్చాం! ఇంతిచ్చాం! పుణ్యం చేశాం కదా స్వర్గద్వారాలు తెరవండంటున్నారు. అసలు ఆ చందాలు నా వరకూ రాందే! పోగు చేసిన వాళ్ళే భోంచేస్తున్నారు వాటిని. వంద చందాలో నా కోసం ఖర్చు చేసింది రూపాయి అయినా ఉండదు" అన్నాడు.

"నిజం కావచ్చు" అన్నాను.

"ఇక మండపాలు, మైకులూ! కళ్ళు మండిపోయే లైటింగ్, చెవులు చిల్లులు పడేలా పాటలు! ఆ తొమ్మిది రోజుల దెబ్బకి తర్వాత ఏమీ కన్పించదు, విన్పించదు. ముస్తాబు పేరిట మా నెత్తుల మీంచి, వీపుల్లోంచి కరెంటు వైర్లుతీసి, బల్బులు పెడతారు. నడిచిందా హాయిగా గడుస్తుంది. లేదా, ప్రమాదం జరిగితే ఇంకేమయినా ఉందా?" అన్నాడు స్వామి.

"లాస్టియర్ ఏం జరిగిందో తెలుసుకదా నీకు! షార్ట్ సర్క్యూట్ జరిగి, ముషీరాబాద్‌లో వినాయక మండపం దగ్ధమయింది. మా వాడి వళ్ళంతా కాలిపోయింది. కాలిపోయిన వాణ్ణి కాలిపోయాడని వదిలేశారా! తీసుకొచ్చి ఈ నీట్లో పడేశారు. బొబ్బలెక్కి పోయాడు పాపం! మూణ్నెళ్ళ వరకు నమ్మకం లేకపోయింది. బతికి బట్ట కడతాడా? అన్పించింది. రోజులు బాగున్నాయి. బతికాడు" అన్నాడు స్వామి.


ఆ మాటలు నేను నమ్మలేదనుకున్నాడేమో! కేకేసి, ముషీరాబాద్ వినాయకుణ్ణి పిలిచాడు. వచ్చాడతను. అసహ్యంగా ఉన్నాడు. చర్మం అంతా కాలిపోయిందేమో!అంతటా ఎర్రెర్రని, నల్లని మచ్చలతో ఉన్నాడు. తొండం కూడా తెగిపోయి కన్పించింది. ఉండాల్సినంత లేదు. బాధేసింది.

"నిమజ్జనానికి వద్దాం! అది తలచుకుంటేనే బాధగా ఉంది. ఆ హడావుడి, ఆ ఏర్పాట్లూ జ్ఞాపకం వస్తేచాలు! గజ గజా వణికిపోతాం. ప్రమాదం పొంచి ఉన్నట్టే! ఏ రాజకీయ అవసరాలకు నిమజ్జనాన్ని ఉపయోగించు కుంటారో తెలియదు. ఏ సంఘ వ్యతిరేక శక్తులకు ఉపయోగ పడతామో తెలీదు. ఈ ఉత్సవం పేరిట ఆ మధ్య అబిడ్స్‌లో దోచుకున్నారు. అల్లకల్లోలం చేశారు. గుర్తుందా" అడిగాడు.

'ఉందుంది" అన్నాను.

" ఊరేగింపుగా తెచ్చి, క్రేన్లతో అంతెత్తుకు లేపి 'దబ్'న పడేస్తారే హుసేన్ సాగర్‌లో తలలు పగిలి కొందరం, కాళ్లూ చేతులూ విరిగి కొందరం, వెన్నెముక విరిగి కొందరం, ఏటి కేడాదీ ఏడుస్తూ కూర్చుంటాం. ఒకప్పుడు నిండుగా గుర్రపుడెక్క ఉండేది. ఒత్తుగా సాగరం నిండా పరుచుకుని ఉండేది. పర్వాలేక పోయేది. ఇప్పుడు దానిని తొలగించేశారు. మాపాట్లు చెప్పకు మరి" అన్నాడు స్వామి.

"స్వచ్ఛమైన నీరు, ప్రవహించే నీరా అంటేకాదు. నిల్వనీరిది. కాలుష్యమయం. దుర్గంధ పూరితం. కంపు తొండాల్ని అదరగొట్టేస్తోంది. ఊపిరాడ్డం లేదు. ఎలాగోలా నెట్టుకొస్తున్నాం. బతుకు 'జీవుడా అని వెళ్ళ బుచ్చుదామంటే, రాత్రిళ్ళు నిద్ర పట్టనివ్వరు ప్రజ. బోర్లా పడుకోలేం. మా ఇబ్బందులు మావి! వెల్లకిలా పడుకుని కునుకు తీస్తుంటే 'ధడేల్'న మీద కొచ్చి పడుతుందో యువతి. పరాయి స్త్రీని ముట్టడం మా ఇంటా వంటా లేదు. తొలగి తప్పుకుందా మంటే వీలుపడనివ్వరు. గుక్కెడు గుక్కెడు నీళ్లు మింగుతూ గుండెల మీద వాలిపోతుంటుంది. ప్రేమిస్తుందా అంటే కాదు. అత్తగారు బాధ పెడుతోందనో, భర్తగారు పొమ్మన్నాడనో, పెళ్ళి కాలేదనో, ప్రేమికుడు మోసం చేశాడనో, పరీక్ష తప్పాననో చెబుతుంది.



ఆత్మహత్య చేసుకుంటున్నా నంటుంది. అందుకు మా గుండెలు వేదికలంటుంది. చస్తుంది. శవాన్ని మీదికెత్తి ఉంచుతాం. పోలీసులు తీస్తారేమోనని చూస్తాం. వాళ్ళు తీయరు... అదోకంపు! ఆడా మగ తేడాలేదు. పిల్లలు, ముసలాళ్ళన్న భేదంలేదు. చిన్న కష్టానిక్కూడా ఓర్చుకోలేక ప్రాణత్యాగాలు చేయడం, మా ప్రాణాలు తీయడం" అన్నాడు స్వామి.

"ఇది చాలదన్నట్టు ఆ మధ్య ఆ ఏకశిలా విగ్రహం బుద్ధుడు పడిపోయాడు. పది పన్నెండు మంది మీ మనుషులు చచ్చారు. అదలా ఉంచండి. మా వాళ్ళు సుమారుగా యాభై మంది 'హరీ' మన్నారు. మీ గురించి మీర్రాసుకున్నారు. మా గురించి చిన్న వార్తన్నా రాలేదు. మమ్మల్ని ఎవరు పట్టించుకుంటున్నారు? లేపి బుద్ధుణ్ణి నిల్చోపెట్టారు. మళ్ళీ ఎవ్వడు పడతాడోనని భయంగా ఉంది" ఆయాస పడ్డాడు స్వామి. ఆగాడు.

చలిగా ఉంది. సిగరెట్ అంటిద్దామని స్వామికి కోపం వస్తుందేమోనని ఊరుకున్నానంతసేపూ. ఇక నావల్లకాదు. వస్తే వచ్చిందని సిగరెట్ తీసి ముట్టించాను. గుప్పగుప్పన పొగలొదిలాను.

"క్షమించాలి. అలవాటు ఆగలేక పోతున్నాను. ఇబ్బందా" అడిగాను.'ఈ పొగలొక లెక్కా! అఖండ దీపాలు, అగరొత్తుల ధూపాల ముందు నీ పొగ 'ఏమాత్రం' అన్నట్టు చూశాడాయన.

"ఆత్మహత్యలు చేసుకుందికి వాళ్ళూ వీళ్ళూ పడుతున్నారు. ఓకే!బుద్ధుడు పడ్డాడు. తప్పదు ఓకే! బస్సులొచ్చి కూడా మీద పడుతోంటే ఏం కావాలయ్యా మేం? ఎలా బతకాలి" అడిగాడు. తొండంతో నెత్తి కొట్టుకున్నాడు.

"అందుకని మేమంతా మూకుమ్మడిగా ఒక నిర్ణయానికొచ్చాం" అన్నాడు.

"ఏంటది" అడిగాను.

"ఈ బాధలు గట్టెక్కాలంటే ఈ హైదరాబాద్ వదిలి పారిపోదా మనుకుంటున్నాం. అందులో భాగమే గత రెండు రోజుల అదృశ్యాలు" అన్నాడు.

అసలు విషయాని కొచ్చాడు స్వామి. జాగ్రత్తగా డీల్ చేయాలను కున్నాను.

"ఎక్కడికి పోతారు" అడిగాను.

"దేశం నిండా అనేక నదులున్నాయి. వాటిలో వేటిలోనన్నా దూకి నిశ్చింతంగా ఉందామనుకుంటున్నాం." అన్నాడు.

"ఎలా వెళ్తారు"

"రైళ్లెక్కి"

"ఈ అవతారాల్తోనే" ఆశ్చర్యపోయాను.

"ఇలా వెళ్తే ఏమన్నా ఉందా? మారు వేషాల్లో వెళ్దామనుకుంటున్నాం. కుంటివాడుగా, గుడ్డివాడుగా, బిచ్చగాళ్ళలా రైళ్లెక్కి నదులు రాగానే దూకేస్తాం"అన్నాడు స్వామి.

## మీ ఇంటి పేరు ఎలా వచ్చింది ?

**కప్పగంతులు:** తెలియవచ్చినంత వరకు బ్రాహ్మణుల్లో ముఖ్యంగా వైఖానస శాఖ వారిలో ఈ ఇంటి పేరు కనిపిస్తోంది. ఇతరులకుందేమో తెలియదు. శబ్దార్థాన్ని బట్టి వుండే అవకాశం లేకపోలేదు. దీనికి వేద పఠనంలో ఒక రీతి అని అర్థం చెప్పడం జరిగింది. ఈ భావన సరికాదనిపిస్తోంది. వేద పఠనం ఒక క్రమంలోనే జరుగవలసియుంది. దానికి భిన్నమైన రీతి అంగీకార్యము కాదు. సంస్కృతంలో దీనికి సమానమైన పదం మండూక గతి. అక్కడ దీనికర్థం వ్యాకరణపరంగా, కొన్ని సూత్రాలను క్రమం వదిలి పఠించడం. దీనికి కారణమిది. సృష్టిలోని సమస్త జంతుజాలపు గమనరీతికి సాధారణ పద్ధతిలో ఒక క్రమం వుంటుంది. అంటే ఒక అడుగుకు మరో అడుగుకు మధ్యగల దూరం దానిని గమించడానికి పట్టే వ్యవధిలో సమత వుంటుంది. కాని కప్పగమనం అలా వుండదు. అది గెంతే తీరులో సమత వుండదు. ఒక గెంతులో వుండే దూరానికి, దాని తరువాతి గెంతులో వుండే దూరంలో వ్యత్యాస ముంటుంది. పిల్లలు నీటిమీద తేలి ఎగిరే పద్ధతిలో చిల్ల పెంకులు విసరుతారు. అది నీటిని తాకి మరల ఎగిసి మరల నీటిని తాకి గెంతుతూ ప్రయాణం చేస్తుంది. ఆ గెంతులలో కూడా సమస్థితి వుండదు. అందువలన ఆ ఆటను కప్పగంతులంటారు. ఆ విధంగా సూత్ర పఠనంలో క్రమం తప్పి చదివితే దానిని మండూక గతి అంటారు. అలా చదివే వారికి ఆ కుటుంబ నామం స్థిరపడియుండవచ్చును.

కాగా లోకంలో కప్పగంతు లేక కప్పదాటు పదానికి మరో సందర్భంలో కూడా వ్యవహారంలో వుంది. ఇది నాడీ చలనానికి సంబంధించింది. గుండె కొట్టుకునే విధానాన్ని ఆశ్రయించి వుంటుంది. దీని చలనంలో కూడ ఒక క్రమం వుంటుంది. వ్యక్తియొక్క ఆరోగ్యాన్ని బట్టి దీని చలనంలో భేద మేర్పడుతుంది. అంటే చలనానికి చలనానికి మధ్యగల వ్యవధి తక్కువ గావచ్చు. ఎక్కువ గావచ్చు. ఏమైనా అన్నడు కూడ ఒక సమత వుంటుంది. చలనంలోని హ్రస్వ దీర్ఘతలను బట్టి వైద్యుడు రోగ నిదానం చేస్తాడు. (ఇప్పుడు నాడీచలనం గమనించగలవారు తక్కువైనారు) అలాకాక, సమత లోపించి, ఒకసారి దీర్ఘంగా, మరొకసారి హ్రస్వంగా, ఒక సమతకాని నాడీ చలనం వుంటే నాడి కప్పదాటు వేస్తోందంటారు. అలాంటి రోగిని మరణం నుండి తప్పించడం దాదాపుగా అసాధ్యం. అంటే నాడీ చలనాన్ని గ్రహించడంలో ఎంత నేర్పు అవసరమో బోధపడుతోంది. అలాంటి చలనాన్ని గ్రహించి, కప్పదాటుగా నిర్ధారించడం చాలా నైపుణ్యంతో కూడినదని, దానిని గ్రహింపగలవారికి, కప్పగంతుల అనేది పౌరుషనామంగా వర్తిస్తోందని మరొక భావన. ఈ రెంటిలో ఆ కుటుంబాలవారికి దేనివల్లనైనా ఆ గృహనామం స్థిరపడి యుండవచ్చు.



అందుకు ఈ చిరునామాకు పంపండి.
డా. యార్లగడ్డ బాలగంగాధరరావు
ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
నాగార్జున విశ్వవిద్యాలయము
నాగార్జుననగర్ — 522 510

"ఎప్పుడెళ్తున్నారు"

"రేపుటెల్లుండిల్"గా అంతా వెళ్ళిపోతాం" అన్నాడు స్వామి.

"ఇవన్నీ నీకెందుకు చెప్పావంటే అమాయక ప్రజలకి అసలు విషయాలు తెలియాలని చెప్పాను. నిజమైన భక్తులకి నిజానిజాలు తెలియాలని చెప్పాను. అన్నీ వివరంగా రాసి, మీ పేపర్లో వేస్తావని చెప్పాను. మా అదృశ్యాల వెనక మా తప్పేమీ లేదని చెప్పడానికి చెప్పాను." అని చెప్పాడు స్వామి.

"అయితే, ఈ సారి జంటనగరాలు బోసి పోతాయన్న మాట! ఉత్సవ కమిటీ ఊసే ఉండదన్న మాట" అన్నాను.

"అంతేగా అబ్బాయ్! వెళ్ళిరా" అన్నాడు.

స్వామి దగ్గర శలవు తీసుకుని స్కూటర్ స్టార్ట్ చేశాను. రూంకి వెళ్ళాను. అయితే అది నా రూం కాదు. పోలీస్ కంట్రోల్ రూం, అక్కడికి వెళ్ళి పథకం ప్రకారం గణపతుల పరారీ పర్వాన్నంతా పూసగుచ్చినట్టు చెప్పాను. కట్టుదిట్టమయిన చర్యలు తీసుకోండన్నాను. సరేనన్నారు వాళ్లు.

మర్నాటి నుంచి సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, నఫిల్‌గూడ తదితర స్టేషన్లలో రైళ్లెక్కిన కుంటి, గుడ్డి బిచ్చగాళ్లందర్నీ పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రారంభమయింది.

(విలాస్‌సారంగ్ మీద ప్రేమతో)